## రాజకీయ సమాధే

మొదటి పేజీ తరువాయి

వెందిన కాంట్రాక్టర్లతో రెండు పద్ధతులలో వ్యవహరించడం వల్ల ఈ నిజాన్ని తానే బయట పెట్టినట్లైంది; తన చేతితోనే తన కళ్లు పొడుచుకున్నట్లయ్యింది. పోనీ ఇప్పటికైనా తన తప్పు తెలుసుకుని, సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తున్నదా అంటే అదీ లేదు. టెండర్లు తక్కువకు పడ్డాయి కాబట్టి కాంట్రాక్టర్లు రింగ్ కాలేదని అర్థం; తన ప్రభుత్వం ఎంతో నిజాయితీగా వుందనడానికి ఇదే సూచన అని ప్రకటించారు ముఖ్యమంత్రి గారు. కానీ అదే సమయంలో మొదటి తొమ్మిది మంది మాట ఏమిటి అంటే మాత్రం ఆయన దగ్గర నుంచి సమాధానం లేదు.

నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం అనేది నిజంగా ఒక యజ్ఞం వంటిది. ఎన్నో అడ్డంకులు, అవరోధాలు, ఇబ్బందులు, అభ్యంతరాలు, ఆంక్షల మధ్య; ఎంతో కర్తవ్య దీక్షతో, చిత్తశుద్ధితో నిర్వహించవలసిన కార్యం ఇది. ఆషామాషీగా తీసుకునే వ్యవహారం కానే కాదు. ప్రాజెక్టుల నిర్మాణం రాజశేఖరరెడ్డి గారి కల మాత్రమే కాదు; రాష్ట్ర ప్రజల భవిష్యత్తు సమస్య. రైతాంగానికి అదొక చావు బ్రతుకుల పోరాటం. కొన్ని కోట్ల మంది జీవితాలతో ముడిపడి వున్న ఈ అంశంలో ప్రభుత్వం నిజాయితీగా పనిచేయడమే కాదు; అట్లా పని చేస్తున్నట్లు కూడా కన్పించాలి. కానీ అందుకు విరుద్ధంగా జరుగుతున్నది వ్యవహారం. ప్రజాధనం దోపిడీకి ప్రాజెక్టుల పేరుతో తలుపులు బార్లా తెరుస్తున్నారు అనే ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రాజెక్టుల నిర్మాణం కంటే అందులో వచ్చే కమీషన్‌లకే ప్రభుత్వ నేతలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని; అందుకోసమే వీటిని ఇంత పెద్ద ఎత్తున చేపట్టారని; అనుమతులు, అంచనాలు లేకుండా ప్రాజెక్టులు కట్టడం సాధ్యం కాదని తెలిసీ వంచనకు పాల్పడుతున్నారని ప్రజలు విశ్వసించే తీరులో నడుస్తున్నాయి ఈ తతంగాలన్నీ. ఇది ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకే కాదు - ప్రజాస్వామ్యానికే మంచిది కాదు. ఏ ప్రభుత్వం వచ్చినా ఇంతే అనే వైరాగ్యం ప్రజలలో కలిగితే ప్రజాస్వామ్యం మీదనే నమ్మకం నశించి పోతుంది. అంతటి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడక ముందే రాజశేఖరరెడ్డి గారు నిద్ర మేల్కోవాలి; ఈ అవినీతితో ఆయనకు సంబంధం వుందని ఇప్పటి వరకు ఎవరూ ఆరోపించలేదు. కానీ ప్రభుత్వ నిర్వహణలో ఆయన అనుభవరాహిత్యాన్ని, అలసత్వాన్ని వినియోగించుకుని కొందరు అధికారులు, రాజకీయవాదులు, కాంట్రాక్టర్లు ఈ దుర్మార్గానికి పాల్పడుతున్నారు అన్నది ఆయన కాదనలేని నిజం. తప్పు ఎవరి వల్ల జరిగినా తప్పే; ఇప్పటికైనా ఆయన ఆ నిజం గ్రహించి జరుగుతున్న దోపిడీని అరికట్టకుంటే ఆయనకే కాదు, కాంగ్రెస్ పార్టీకి కూడా రాజకీయ సమాధి తప్పదు.

## ప్రభుత్వమెందుకు

మొదటి పేజీ తరువాయి

ఆయన కొంప ముంచింది.

నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో రాజశేఖరరెడ్డి ధోరణి తెలిసిన సంగతే. ఇంతకాలం ప్రతిపక్షాలు, పత్రికలు మాత్రమే ఈ విషయంలో విమర్శలు చేస్తుండినాయి. ఇప్పుడు సాక్ష్యాత్తూ తన మంత్రే నీళ్లులేని ప్రాజెక్టులకు శంకుస్థాపనలెందుకని ప్రశ్నించాడు. ప్రభుత్వం చర్యను తప్పుపట్టే వారు ప్రభుత్వంలో వుండడం కంటే అవమానం మరొకటి వుండదు. ఆయన చేసిన విమర్శ, వ్యాఖ్య సరైనవి కావని ప్రజలకు వివరణ ఇచ్చి, ప్రభుత్వాన్ని నిందించిన తప్పుకు సత్యనారాయణ రావును మంత్రివర్గం నుంచి తొలగించ నన్నా తొలగించాలి; లేదా నిజంగా నీళ్లు లేని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన తప్పుకు చెంపలు వేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఇవి రెండూ చేయకుండా గమ్ముండి పోవడం అంటే ఏమిటి అర్థం?

హెల్మెట్ల విషయంలో ఒక అధికారి వ్యాపారుల దగ్గర లంచం తిని ప్రజలను మోసం చేసింది అని ఒక మంత్రి ఆరోపణ చేసిన తర్వాత ఆ అధికారిని అదే పదవిలో కొనసాగించడం ఏ ప్రభుత్వానికైనా పరువా? సంతోష్‌రెడ్డి ఆరోపణ చేసింది ట్రాఫిక్ విభాగంలో వున్నత స్థానంలో వున్న తేజ్‌దీప్ కౌర్ అనే పోలీసు అధికారి మీద. హెల్మెట్ల వాడకంపై తీసిన డాక్యుమెంటరీ చిత్ర నిర్మాణంలో కూడా ఆమె అవినీతికి పాల్పడిందని ఇదే మంత్రి పత్రికల వారి దగ్గర వ్యాఖ్యానించారు. ఇంత పెద్ద తప్పు నిజంగా ఆ అధికారిణి చేసివుంటే ఆమెపై తక్షణం విచారణ, చర్య జరపాలి; లేదా ఒక అధికారి మీద అనవసరపు ఆరోపణ చేసి, ప్రభుత్వాన్ని నగుబాటు పాలు చేసినందుకు ఆ మంత్రిని మంత్రివర్గం నుంచి తీసివేయాలి; కనీసం మందలించాలి.

ఇవేవీ జరగడం లేదు; జరిగే సూచనలు కూడా కన్పించడం లేదు. దాని అర్థం ఏమిటి? ఈ మౌనాన్ని ప్రజలు ఎట్లా అర్థం చేసుకోవాలి?



పెన్నానది ఒడ్డున రోటరీ క్లబ్ నిర్మిస్తున్న అత్యాధునిక శ్మశాన వాటికకు 8 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న 'ది నెల్లూరు ఆర్య వైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్' సభ్యులు.

## ఇన్‌ఛార్జీలు

5వ పేజీ తరువాయి

పోవడంతో కోడూరు గ్రామ పంచాయితీ సీనియర్ కార్యదర్శి మరియదాసుకు ఇటు ఆరడి, వెంకనపాళెం కార్యదర్శి బాధ్యతలు అప్పజెప్పారు. దీంతో మూడూళ్లకు దొడు తీయలేక పోతున్నారు. కొత్తపాళెం, వెంకనపాళెం, పాతఅములూరు గ్రామాలకు కార్యదర్శులు కావాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం ఈ చొరవ చూపి రెగ్యులర్ అధికార్లను నియమించాల్సి వుంది.




